కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి

కుష్టు వ్యాధి నివారణ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ విజయలక్ష్మి

షాబాద్, డిసెంబర్ 2: కుష్టు వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు విజయలక్ష్మి అన్నారు. సోమవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కుష్టు వ్యాధి అనేది దీర్ఘకాలిక అంటు వ్యాధి అని, ఇది మైక్రో బ్యాక్టీరియం లెప్రే అని పిలిచే ఒక రకమైన బ్యాక్టీరియాతో వస్తుందన్నారు. ఈ వ్యాధి చర్మం, పరధీయ నరాలు, ఎగువ శ్వాసకోశంలోని శ్లేష్మం, కండ్లను ప్రభావితం చేస్తుందని తెలిపారు. తొలిదశలో చికిత్స చేయిస్తేనే కుష్టువ్యాధిని నివారించవచ్చన్నారు. శారీరక వైకల్యంతో పాటు, కుష్టువ్యాధి బారిన పడిన వ్యక్తులు కళంకం, వివక్షను ఎదుర్కొంటారని చెప్పారు. వైద్యరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిని నివారించేందుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. డిసెంబర్ 2 నుంచి 15 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తమ సిబ్బంది సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి రోగులను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మేరినా, లక్ష్మి, పాఠశాలల హెచ్ఎంలు యామిని, కృష్ణకుమారి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న సీఐ నరసింహారావు

యాచారం, డిసెంబర్ 2 : దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాచారం సీఐ నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలో దొంగతనాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలు, యువకులు, వ్యాపారులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎలాంటి సమాచారం అడిగినా చెప్పొద్దన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, ఎక్కడైనా దొంగతనాలు జరిగినా వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి అన్యాయం జరిగినా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించవచ్చని తెలిపారు. యువత చెడు మార్గంలో నడిస్తే చూసి ఊరుకోవద్దని పోలీసులకు సమాచారం ఇచ్చి కౌన్సెలింగ్ ద్వారా సన్మార్గంలో నడిపించేలా చేయాలన్నారు. వ్యాపారులు తమ దుకాణాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇర్విన్ విద్యార్థులు ఎంపిక

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాడ్గుల, డిసెంబర్ 2 : చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా సోమవారం తుర్కయాంజాల్‌లో లార్డ్స్ పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. చెకుముకి పోటీల్లో ఇర్విన్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిలో తెలుగు విభాగంలో ఆకుతోట స్రోహిత్, సూదిని నచికేత్, ఆకుతోట శివకుమార్, ఆంగ్ల విభాగంలో కేశమోని వైష్ణవి, కోరుకోరు లహరిక, కొర్పూరి శివకుమార్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యరని పాఠశాల హెచ్ఎం, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు లండం పర్వతాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14, 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు అదిలాబాద్‌లో జరుగుతాయని తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, బాలూనాయక్, శ్రీలక్ష్మి, అనిత, నందన, అర్చన, కళవతి, మల్లేశ్, మహేశ్, సునిత తదితరుల పాల్గొన్నారు.

పోయిన ఫోన్ లభ్యం.. బాధితుడికి అందజేత

బాధితుడికి ఫోన్‌ను అందజేస్తున్న సీఐ జగదీశ్

మాడ్గుల, డిసెంబర్ 2 : మండల పరిధిలోని నల్లచెరువు గ్రామానికి చెందిన కట్ట జలంధర్ సెల్‌ఫోన్ 20 రోజుల క్రితం అవురుపల్లి గ్రామం వద్ద పడిపోయింది. వెంటనే మాడ్గుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో ఫోన్‌ను గుర్తించి సోమవారం సీఐ జగదీశ్ బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ఖాజా ఉన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న అలనాటి విద్యార్థులు

కందుకూరు, డిసెంబర్ 2 : మృతుడి కుటుంబానికి అలనాటి విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. మానవతదృక్పథంతో ముందుకు రావడంపై వారిని పలువురు అభినందిస్తున్నారు. మండల పరిధిలోని ఆకులమైలారం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న లాడే కమార్ మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో పిల్లల విద్యా భోదన, కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న అలనాటి తోటి విద్యార్థులు ముందుకొచ్చి కుటుంబానికి ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించి రూ.50 వేలు మృతుడి భార్యకు సోమవారం అందజేశారు. దీంతో విద్యార్థులు చేసిన కృషిని పలువురు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అలనాటి విద్యార్థులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురికారు

ఆర్కేపురం, డిసెంబర్ 2 : రక్తదానం చేస్తే ఎలాంటి అనారోగ్యానికి గురికారని, మరింత రోగ నిరోధక శక్తి పెరుగుతుందని షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ముస్తఫా అన్నారు. కార్తిక వనభోజనాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 55 ఏండ్ల వరకు రక్త దానం చేయవచ్చని తెలిపారు. ప్రతి మనిషి సగటున మూడు నెలలకోసారి రక్తదానం చేస్తే కలిగే ఉపయోగాలను వివరించారు. రక్తదాతలను డాక్టర్ ముస్తఫా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సమస్త ప్రతినిధి విజయ ఉన్నారు.

అమరవీరుల త్యాగాలతోనే తెలంగాణ

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అంతారెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి
- అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం
- ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ

మొయినాబాద్‌లో అమర వీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మొయినాబాద్, డిసెంబర్ 2 : అమరువీరుల తాగ్యాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అంతారెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి అన్నారు. దీక్షా దివస్‌లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో అమరుల కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు సన్మానించి ఆర్థిక సాయం అందజేశారు. పెద్దమంగళారం గ్రామానికి చెందిన మందడి యాదిరెడ్డి తల్లిని, చాకలిగూడ గ్రామానికి చెందిన అమరుడు మహేశ్ భార్యను, అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన అమరురాలు సరిత తండ్రిని సన్మానించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమానికి పురుడు పోసుకున్నదని, తన ప్రాణాలను సైతం లెక్క లేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. అనంతరం తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పదేండ్ల పాలనలో తెలంగాణ జీడీపీ గణనీయంగా పెరిగిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎంఏ రవూప్, సుధాకర్‌యాదవ్, జగన్‌మోహన్ రెడ్డి, దారెడ్డి వెంకట్‌రెడ్డి, కొత్త మాణిక్‌రెడ్డి, అంజయ్యగౌడ్, పరమేశ్, షాబాద్ ప్రవీణ్, రాజ్‌కుమార్, సత్తిరెడ్డి, అలీమ్, రవి, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

కడ్తాల్‌లో కోనో కార్పస్ చెట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అంజి

కడ్తాల్, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని కోనో కార్పస్ చెట్లను తొలగించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు అంజి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి డివైడర్‌తోపాటు, సమీప వెంచర్లలోని కోనో కార్పస్ చెట్లను స్థానిక యువకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోనో కార్పస్ మొక్కలతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ మొక్కలను పలు దేశాల్లో నిషేధించారని గుర్తు చేశారు. వీటితో శ్వాసకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామంలో ఉన్న కోనా కొర్పస్ చెట్లను అన్నింటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కే.శివ, పీ.శివ పాల్గొన్నారు.

అంధులకు అండగా పూర్వ విద్యార్థులు

అంధుల ఆశ్రమానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 2 : మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ప్రతిఏటా ఇబ్రహీంపట్నం స్ఫూర్తిజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధ విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం అంధ విద్యార్థులకు పూర్వ విద్యార్థులంతా కలిసి అన్నదానం చేయడంతో పాటు ఆశ్రమం అవసరాల కోసం రూ.20వేలు అందజేశారు. ఈ సందర్భంగా అంధుల ఆశ్రమానికి అండగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగో విడుత రుణమాఫీ రూ. 2.5 కోట్లు

కొత్తూరు, డిసెంబర్ 2: మండల పరిధిలో నాలుగో విడుతలో రూ.2.5 కోట్లు పంట రుణమాఫీ అయ్యాయి. మండల వ్యాప్తంగా రూ.2 లక్షల లోపు రుణం ఉన్న రైతుల్లో నాలుగో విడుతలో 253 మంది రైతులకు రూ.2,51,71,198 కోట్లు మాఫీ అయిందని మండల వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. బ్యాంకుల వారీగా కొత్తూరు యూనియన్ బ్యాంకులో 32 మంది రైతులు, పెంజర్ల పంజాబ్ నేషనల్ బ్యాంకులో 27, తిమ్మాపూర్ ఎస్‌బీఐలో 62, కొత్తూరు ఎస్‌బీఐలో 8, కొత్తూరు ఏపీజీవీబీలో 71, తిమ్మాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 33, ఇస్ముల్‌నర్వ ఏపీజీవీబీలో 18, కొత్తూరు సౌత్ ఇండియా బ్యాంకులో ఇద్దరు రైతులకు రుణమాఫీ అయిందని తెలిపారు.

దవాఖాన నిర్మాణానికి వక్ఫ్ స్థలం కేటాయించాలి

బడంగ్‌పేట, డిసెంబర్2: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంజూరు చేయించిన 30 పడకల ఆసుపత్రి కోసం వక్ఫ్ స్థలం కేటాయించే విధంగా చొరవ తీసుకోవాలని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హమీద్ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దర్గా కమాన్ దగ్గర వక్ఫ్ స్థలం కేటాయిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. అధికారులతో చర్చించి స్థలం కేటాయించే విధంగా చొరవ తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కోఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కృష్ణారెడ్డి, సయ్యద్ బదర్, బర్కత్ అలీ, ఆరీఫ్, అజిమ్, సలీమ్ తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం అందజేత

ఆర్కేపురం, డిసెంబర్ 2 : రెడీటూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓల్డ్ ఏజ్ హోంకు హైమావతి రూ.50 వేల రూపాయల విరాళం అందజేశారు. భర్త మోహన్ రావు జ్ఞాపకార్థం హైమావతి వితరణ చేసినట్లు వృద్ధాశ్రమ నిర్వాహకుడు శంకర్‌గౌడ్ తెలిపారు. ఓల్డ్ ఏజ్ హోంలో ఎక్కువ మంది వృద్ధులు ఉండటంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది ఉందని ఎవరైనా దాతలు ఉంటే ఈ 8790815527 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, నవంబర్ 2 : ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం అధికారులతో సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి సర్వే ముగిసిన సందర్భంగా ఇకపై అధికారులు ప్రజా సమస్యలపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్, విద్య, వైద్య, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మేజర్ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, ఏవో రవికుమార్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

సిటీబ్యూరో, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగం పెరిగి పర్యావరణ సమస్య తలెత్తుతున్నదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.వెంకట్ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైద్య శాఖాధికారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని చెప్పారు. అడవులను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని సూచించారు. అనంతరం, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అశ్రితారెడ్డి, సునీల్ కుమార్, మహ్మద్ ఒమర్ బీన్ సలేహ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసిన హెచ్ఎం శ్రీనివాస్‌శర్మ

కందుకూరు, డిసెంబర్ 2 : విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంటుందని మండల పరిధిలోని నేదునూరు, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ శర్మ అన్నారు. బంగారు తల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ప్రేరణ పేరుతో రేపటి భవిష్యత్ ఎలా ఉండాలనే అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నతనం నుంచే మంచి నడవడి నేర్చుకోవాలని కోరారు. భవిష్యత్‌లో భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. విద్యార్థులు మంచి అలవాట్లను నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బంగారు తల్లి ఫౌండేషన్ నిర్వాహకులు నీరజ, ఉపాధ్యాయులు వెంకటేశం, గ్లోరీ, శాంతకుమారి, కౌసల్య, కృష్ణ, కరుణాకర్, శ్రీవాణి, సురేశ్, ఎండీ బషీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కడ్తాల్ లో మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్, డిసెంబర్ 2: మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు కేశని సత్యమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక నాయకులతో కలిసి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మీగడి అంజయ్యముదిరాజ్ మృతదేహంపై మాజీ ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రాధాకృష్ణ ట్రస్ట్ తరపున మాజీ జడ్పీటీసీ రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట మహేశ్, నర్సింహ, లాయక్‌అలీ, యాదయ్య, దశరథం, జంగయ్య, వెంకటేశ్, శ్రీను, శ్రీరామ్, జగన్ తదితరులు ఉన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంతోపాటు భగత్ సింగ్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కుల, చేతి వృత్తులకు పెద్దపీట వేశారని తెలిపారు. హెయిర్ కటింగ్ సెలూన్ షాపులకు రెండు వందల యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడమే తన ధ్యేయమని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం భవన అభివృద్ధికి రాధాకృష్ణ ట్రస్ట్ తరపున ఆయన రూ.51 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ చైర్పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్య టదర్శి రాఘవేందర్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యానాయక్, వేణుపంతులు, జహంగీర్‌అలీ, యాదిగిరిరెడ్డి, శ్రీనివాస్, మహేందర్, అంజయ్య, జంగయ్య, నర్సింహ, గోపాల్, శంకరయ్య, శివ, వెంకటేశ్, మురళీ, రాజు, గణేశ్, వినోద్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న గుడి నిర్మాణానికి రూ.50వేల విరాళం

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బిలకంటి శేఖర్‌రెడ్డి

యాచారం, డిసెంబర్ 2 : మండల పరిధిలోని మేడిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న నక్కర్త మల్లన్న గుడి నిర్మాణానికి నందివనపర్తికి చెందిన బీఎన్ రెడ్డి ట్రస్టు చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి రూ.50 వేలు సోమవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన శేఖర్‌రెడ్డికి నక్కర్త యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిసారు. మల్లన్న గుడి నిర్మాణానికి విరాళం అందించేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సాయం చేసినట్లు శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముంత జంగయ్య, ఆలంపల్లి నర్సింహ, ముచ్చర్ల సంపత్, ఒంగూరి జంగయ్య, బేత జంగయ్య, పాలమోని సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏడీఈగా రవీందర్ నాయక్



బదిలీపై వెళ్తున్న రవీందర్‌కుమార్‌ను సన్మానిస్తున్న విద్యుత్ సిబ్బంది

కొత్తూరు, డిసెంబర్ 2: షాద్‌నగర్ విద్యుత్ ఏడీఈగా రవీందర్ నాయక్ బదిలీపై వచ్చారు. అంతకు ముందు ఇక్కడ ఏడీఈగా పనిచేసిన రవీందర్‌కుమార్ ఉప్పల్‌కు బదిలీపై వెళ్లారు. రవీందర్‌నాయక్ ఇంతకు ముందు మేడ్చల్ ఏడీఈగా పనిచేసి సోమవారం ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందేలా చూస్తానని తెలిపారు. అనంతరం ఉప్పల్‌కు బదిలీపై వెళ్లిన రవీందర్‌కుమార్‌ను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో కొత్తూరు, నందిగామ, కేశంపేట ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్యారెంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్

మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు లంబాడి కిరణ్‌కుమార్

షాబాద్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్‌కుమార్ విమర్శించారు. సోమవారం షాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు 420 హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ఏ ఒక్క గ్యారంటీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోవడం కాంగ్రెస్ పార్టీ పాలనకు అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణలో చేసిందేమి లేదని చెప్పారు. అభివృద్ధిపై కాకుండా దోచుకోవడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మహేందర్, రాము, సతీశ్‌రెడ్డి, నారాయణ, మాణెయ్య, గోపాల్, రాజీవ్ రెడ్డి, మహేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అరికట్టాలి

ఆదిబట్ల. డిసెంబర్ 2: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలను అరికట్టాలని 10వ వార్డు కౌన్సిలర్ కోరె కళమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానకిశోర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని అనుమతి తీసుకుని అంతకు మించి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె తెలిపారు. పలువురు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మా ణాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు కోరె జంగయ్య తదితరులు ఉన్నారు.